క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్‌కు ఘన స్వాగతం



మంత్రి అమర్‌నాథ్‌ను ఆశీర్వదిస్తున్న అమ్మమ్మ

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా నియమితులైన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా మిందిలోని స్వగృహానికి వచ్చిన అమర్‌నాథ్‌ను కుటుంబ సభ్యులు హారతిచ్చి స్వాగతించారు.

'గ్రామదేవతల పండగకు సహకరించండి'

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో ఈ నెలలో నిర్వహించనున్న అమ్మవారి జాతరలు సజావుగా సాగేందుకు సహకరించాలని స్థానిక నాయకులు సీఐ ఎర్రన్నాయుడును కోరారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. బొర్రమాంబ, బోయమాంబ, పైడిమాంబ జాతరలు పెద్ద ఎత్తున నిర్వహించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. సీఐను కలిసిన వారిలో నెల్లి శ్రీనివాసరావు, విందుల వరహాలు, మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులున్నారు.

17 నుంచి బ్రహ్మోత్సవాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17న అంకురార్పణ, 18న ధ్వజారోహణం, శ్రీవారి కల్యాణం, 19న పండిత సదస్యం, 20న లక్ష తులసి పూజ, 21న లక్ష కుంకుమార్చన ఉంటాయని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఇళ్ల పట్టాల పత్రాలను పంపిణీ చేస్తున్న రమణ

పెదగంట్యాడ: పేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు దొడ్డి రమణ అన్నారు. 76వ వార్డు వుడా ఫేజ్–4లోని లబ్ధిదారులకు మంజూరైన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేనిశెట్టి చిన్నారావు, శ్రీనివాసరావు, చిన్నారావు, వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



అగ్ని ప్రమాదాలను అదుపు చేయడం గురించి వివరిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగనంపూడి: ప్రమాదాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో అప్రమత్తత, నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని లుపిన్ ఫార్మా కంపెనీ మేనేజర్ ఎస్.అప్పారావు అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు రకాల ప్రమాదాలు, నివారణ మార్గాలు వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి, మంటలను ఎలా అదుపు చేయాలో వివరించారు. హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డకు కల్యాణ కానుక



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫాపై తల్లిదండ్రుల హర్షం

గాజువాక : ఆడపిల్ల పెళ్లి అంటే ఆ ఇంట ఎంతో పెద్ద వేడుక. అదే సమయంలో ఖర్చును తలచుకుంటే తల్లిదండ్రుల్లో తెలియని ఆందోళన. సామాన్య, పేద కుటుంబాల్లో వారికి అది తలకు మించిన భారమే. అప్పు చేయక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో పేదింటి ఆడబిడ్డకు అన్నగా అండగా నిలుస్తూ.. సామాన్య కుటుంబాలకు బాసటగా నిలిచారు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి. ఆడపిల్లలకు గౌరవప్రదంగా వివాహం జరిపించేందుకు తోడ్పాటునందిస్తున్నారు. వారి కల్యాణానికి ప్రభుత్వం తరపున నగదు దీవెనను అందిస్తూ వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలను ప్రవేశపెట్టారు. ఈ పథకాల ద్వారా నూతన దంపతులకు నగదు బహుమతిని అందిస్తున్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ పథకం కింద గత ప్రభుత్వం అందించిన దాని కంటే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికంగా నగదు సాయం అందిస్తోంది. చంద్రబాబు హయాంలో చంద్రన్న పెళ్లి కానుక పథకం కింద ఎస్సీలకు రూ.40వేలు, ఎస్టీలకు రూ.50వేలు ఆర్థిక సాయం అందగా, ఇప్పుడు

వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం లబ్ధి
2021-22	16	5,50,000
2022-23	89	93,55,000
లబ్ధిదారులకు జమ అయిన నగదు		: 99,05,000

ఈ మొత్తాన్ని భారీగా పెంచి రూ.లక్షకు పైగా ప్రోత్సాహం అందజేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

పేద ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక సాయం కోరుతూ ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను ప్రతీ మూడు నెలలకోసారి పరిశీలించి అప్పటివరకు నిర్ణయించిన అర్హులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పిల్లలు తమ జీవిత భాగస్వామిగా తమ కులానికి చెందిన వారిని ఎంచుకుంటే నిర్దేశిత మొత్తం, ఇతర కులాలకు చెందినవారిని ఎంపిక చేసుకుంటే అంతకంటే అధిక పారితోషికాన్ని అందిస్తోంది. దివ్యాంగులకు సంబంధించి ఇద్దరికీ వైకల్యం ఉన్నా ఆడపిల్లలకు నగదు ప్రోత్సాహం లభిస్తుంది. వధూవరులు తగిన ధ్రువపత్రాలు, వివరాలతో సమీపంలోని వార్డు సచివాలయంలో సంప్రదిస్తే సిబ్బంది దీనికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించి ఆర్థిక ప్రోత్సాహం అందే విధంగా సహాయం చేస్తారు.



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా లబ్ధి ఇలా..

లబ్ధిదారులు	అందుతున్న లబ్ధి
బీసీ	రూ.50వేలు
బీసీ కులాంతర వివాహం	రూ.75వేలు
ఎస్సీ	రూ.1లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	రూ.1.20లక్షలు
ఎస్టీ	రూ.1లక్ష
ఎస్టీ కులాంతర వివాహం	రూ.1.20లక్షలు
మైనారిటీ (షాదీ తోఫా)	రూ.1లక్ష
దివ్యాంగులు	రూ.1.50లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.40వేలు

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే ఈ డబ్బులను జమ చేస్తారు. కాగా ఈ పథకాల ద్వారా గాజువాక నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.99.05 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది.

అర్హులందరికీ కల్యాణమస్తు పథకం



ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికీ కల్యాణ మస్తు, షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తున్నాం. దరఖాస్తు అందిన వెంటనే వధూవరులకు ప్రభుత్వ సాయం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మధ్యవర్తులకు తావు లేకుండా నేరుగా దరఖాస్తుదారుల ఖాతాల్లోనే డబ్బు జమ అవుతుంది. ప్రస్తుతం మా వద్ద పెండింగ్ దరఖాస్తులు కూడా లేవు.

– **ఎల్.రాము**, సహాయ ప్రాజెక్టు అధికారి, యూసీడీ విభాగం, గాజువాక

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సొంతం



విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లను అందజేస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక : విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. హైస్కూల్ నుంచి పాల్గొన్న 100 మంది విద్యార్థుల్లో ఇద్దరికి బాలచిత్ర అవార్డులు లభించగా, 19 మందికి స్వర్ణ పతకాలు, ఎనిమిది మందికి రజత పతకాలు లభించాయని పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు బి.భావనారుషి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్థన్, శాస్త్రి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలి



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1126వ రోజు, బుధవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ నెల 16న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, ఉక్కు ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కునగరంలోని తృష్ణ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభకు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సామాజిక భవనాలు ప్రారంభం



87వ వార్డులో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 87వ వార్డు ఎరుకుల వీధిలో 20లక్షల రూపాయల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, పార్టీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, చిత్రాడ రమణ, పాలిశెట్టి సత్యనారాయణ, ఆడారి శ్రీనివాస్, చిత్రాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డు ఎస్సీ కాలనీలో..

పెదగంట్యాడ: 75వ వార్డు సీతానగరం ఎస్సీ కాలనీలో కొత్తగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.36 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించామన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రోలింగ్ ఒక మానసిక రుగ్మత'

ఉక్కునగరం: సోషల్ మీడియా వేదికగా నేటి సమాజంలో పెరుగుతున్న ట్రోలింగ్ మానసిన రుగ్మతకు నిదర్శనమని మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు వై.వరలక్ష్మి అన్నారు. ఉక్కునగరంలో నిర్వహించిన మహిళా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల సంభవించిన గీతాంజలి మరణం మహిళా లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. తన సొంత ఇంటి కల నెరవేరిందన్న సంతోషాన్ని పంచుకోవడమే ఆమె పాలిట శాపమైందన్నారు. చనిపోయిన తర్వాత కూడా ఆమెపై వికృత రాతలు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బెండపూడి పాఠశాలకు చెందిన పేద విద్యార్థినులు ఇంగ్లిష్ మాట్లాడటంపై దారుణమైన ట్రోలింగ్ జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి సున్నిత అంశాలను ట్రోలింగ్ చేయడాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, పార్వతి, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ వాయిదా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించాల్సిన బహిరంగ సభ వాయిదా పడింది. ఉక్కునగరం త్రిష్ణా మైదానంలో నిర్వహించాల్సిన ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరు కావాల్సి ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు సభను మర్నాడుకు వాయిదా వేశారు. 16న అదే మైదానంలో నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.3 కోట్లతో గెడ్డలకు రక్షణ గోడలు



గెడ్డల రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలో పలు ప్రాంతాలను కలుపుతున్న గెడ్డలకు రక్షణ గోడలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. వార్డులోని వుడా కాలనీ ప్రధాన గెడ్డ వద్ద బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసినపుడు గెడ్డలు పొంగిపొర్లడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.3 కోట్లతో రక్షణ గోడలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ వార్డులో ఇప్పటికే రూ.18 కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మించామని, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, మౌలిక సదుపాయాలు కల్పించామని వివరించారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్యంరెడ్డి, రామకృష్ణంరాజు, ప్రభావతి, గీత, ఆలీ, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ మింది, 11 కేవీ గాజువాక ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మింది, రాజీవ్‌నగర్, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెదగంట్యాడ పరిధిలో..

పెదగంట్యాడ: 11కేవీ మదీనాబాగ్ ఫీడర్, 11కేవీ పాలవలస ఫీడర్, 11కేవీ పిట్టవానిపాలెం ఫీడర్, 11కేవీ ఏఎంటీజెడ్ ఫీడర్, 33/11కేవీ మదీనాబాగ్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలిదొడ్డి, గిన్నివానిపాలెం, నక్కదొడ్డి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిట్టవానిపాలెం ఫీడర్ పరిధిలోని పిట్టవానిపాలెం, కేఎన్ పాలెం, పెదపాలెం, చినపాలెం, అష్రత్ నగర్, 11కేవీ ఏఎంటీజెడ్ ఫీడర్‌లో పరిధిలోని ఏఎంటీజెడ్ తదితర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వం



త్రిష్ణ మైదానాన్ని సందర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఉక్కునగరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ అంశాన్ని తమ మేనిఫెస్టోలో పెట్టి ఉద్యమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఉత్తరాంధ్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పోచారెడ్డి రాకేష్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఉక్కు పరిరక్షణకు మద్దతుగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16న త్రిష్ణ మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో వారు సభ ఏర్పాట్లు పరిశీలించారు. పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న న్యాయ సాధన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. సమతానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభలో కార్మికులు, నిర్వాసితులు పాల్గొనాలని కోరారు.

రూ.400 కోట్లతో గాజువాక అభివృద్ధి



సిద్ధేశ్వరం డబుల్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సభకు హాజరైన ప్రజలు

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- దయాల్‌నగర్ యూపీహెచ్‌సీ, బీసీ రోడ్డు, సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు ప్రారంభం

పెదగంట్యాడ: గతంలో ఎన్నడూ లేనివిధంగా గాజువాక నియోజకవర్గాన్ని రూ.400కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఒక్కో వార్డుకు రూ.20కోట్లను కేటాయించామని, ఆ నిధులతో రోడ్లు, కాలువలు, పీహెచ్‌సీలు నిర్మించామని వివరించారు. జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం (దయాల్‌నగర్)లో కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అర్బన్ ఆరోగ్య కేంద్రంతో పాటు బీసీ రోడ్డు, సిద్ధేశ్వరం డబుల్ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గాజువాక, గంగవరం, పెదగంట్యాడ, సిద్ధేశ్వరం (దయాల్‌నగర్)లో కొత్తగా యూపీహెచ్‌సీలను నిర్మించామన్నారు. గతంలో అనారోగ్యం వస్తే ఎక్కడో దూరంగా ఉన్న కేజీహెచ్‌కో, గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రులకో పరుగులు తీయాల్సి వచ్చేదని.. ఇప్పుడు అందరికీ అందుబాటులో అధునాతన వసతులతో యూపీహెచ్‌సీలు నిర్మించామన్నారు. అలాగే వాహనచోదకులు, పాదచారుల కోసం పెద్ద ఎత్తున రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ సిద్ధేశ్వరం నుంచి వుడా డబుల్ రోడ్డును అనుసంధానించే సిద్ధేశ్వరం డబుల్ రోడ్డును ఎమ్మెల్యే నాగిరెడ్డి సహకారంతో రూ.4 కోట్ల 40 లక్షలతో నిర్మించామన్నారు. ఒక కోటి 14లక్షల 50 వేల రూపాయలతో 10 పడకల యూపీహెచ్‌సీని, రూ.2కోట్లతో బీసీ రోడ్డును కొత్తగా నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చామని చెప్పారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, ఇల్లపు ప్రసాద్, రోజారాణి, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ,యువశ్రీ, బొడ్డ గోవింద్, కులుకూరి మంగరాజు, ఎస్‌వై నాయుడు, గొందేశి సత్తిరెడ్డి, సత్యారావు, మద్ది శంకర్‌రెడ్డి, రాజాన వెంకటరావు, షౌకత్ ఆలీ, బోగాది సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు వందనం



తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని భాస్కర విద్యానికేతన్ డైరెక్టర్ పాలవలస భాస్కరరావు అన్నారు. ఆటోనగర్ వద్ద గల చట్టివానిపాలెంలోని పాఠశాలలో బుధవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేశారు. మాతృమూర్తులు తమ పిల్లలపై పూలు జల్లి, ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల గొప్పదనంపై పాటలు ఆలపించి, నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రమాదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టం నిలుపుదల చేయాలి



ఉక్కునగరంలో నిరసన తెలుపుతున్న విదసం ఐక్య వేదిక నాయకులు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని నిలుపుదల చేయాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బి.వెంకటరావు డిమాండ్ చేశారు. మత వివక్ష లేని పౌరసత్వం అమలు చేయాలని కోరారు. సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉక్కునగరం మహాత్మా గాంధీ పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసత్వం మత ప్రాతిపదికన ఇవ్వడం దేశ లౌకికవాదానికి విఘాత మన్నారు. దేశంలో ఇప్పటికే మూడు రాష్ట్రాలు సీఏఏను అమలు చేయబోమని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూల భాస్కరరావు, బూసి పరమేశ్వరి, పి.అప్పలరెడ్డి, రమణమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం సలహా మండలి సభ్యునిగా నాగేంద్ర



అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం విమానాశ్రయం సలహా మండలి సభ్యునిగా 68వ వార్డు మిందికి చెందిన జీలకర్ర నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి బుధవారం నియామక పత్రాలు జారీ చేశారు. నాగేంద్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. తన నియామకానికి సహకరించిన రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్‌కు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో పతకాలు



పతకాలతో విద్యార్థులు

గాజువాక : మలేషియాలో ఇటీవల నిర్వహించిన 13వ సైలెంట్ నైట్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో విశాఖ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్స్ కేటగిరీలలోని కాటా, కుమిటీ విభాగాల్లో ఆరు పతకాలను సాధించారు. 12 దేశాలకు చెందిన 2378 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొన్న విశాఖ విద్యార్థుల్లో ముగ్గురు బంగారు పతకాలు, ఒకరు రజత పతకం, ఇద్దరు కాంస్య పతకాలను సాధించినట్టు జాతీయ కోచ్ కోరాడ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా గాజువాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు. కోచ్‌లు వి.ఎస్.డి.ప్రవీణ్, బి.మురళీకృష్ణ, కె.ప్రసాద్ కుమార్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.